


# నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### న్యాయం కావాలి

కోర్టు, కోర్టు వాతావరణం అంటే ఏమాత్రం తెలియని ఓ అరవయ్యేళ్ళ ముసలాయన విజిటర్స్ కోసం ప్రత్యేకించబడ్డ చెక్క బెంచీలో కూర్చుని బిక్కుబిక్కు మంటూ అక్కడ జరిగే తతంగాన్ని చూస్తున్నాడు.

పోలీసులు రకరకాల నేరస్థుల్ని, దొంగలని, దొంగతనం చేయించిన వాళ్ళని, వ్యభిచారులని, వ్యభిచార గృహాలని నడిపేవాళ్ళని, జూదగాళ్ళని అనేకమందిని తీసుకువస్తున్నారు. చాలామంది తమతప్పులని ఒప్పుకుంటున్నారు. న్యాయమూర్తి వారికి వారి నేరాలను బట్టి శిక్షవిధిస్తున్నారు.



లంచ్ విరామ సమయంలో గంటకొట్టారు. పోలీసులు, కోర్ట్ క్లర్క్, ప్యూన్, న్యాయమూర్తి, లాయర్లు, సాక్షులు..అంతా వెళ్ళినా ఆ ముసలాయన మాత్రం కూర్చున్నచోటునించి కదలలేదు.

నేలవైపు చూస్తూ దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు. మధ్యమధ్యలో తనలో తనే ఏదో గొణుక్కుంటున్నాడు. అరగంటకోసారి తన చేతి సంచి లోంచి కొన్ని కాగితాలని బయటికి తీసి చూసుకుని, తృప్తిగా తలాడించి మళ్ళీ వాటిని కరెన్సీ నోట్లకన్నా భద్రంగా ఆ సంచిలో దాస్తున్నాడు.

లంచ్ అవర్ అయిందన్న గుర్తుగా గంట మోగింది. న్యాయమూర్తి మళ్ళీ వచ్చారు. పోలీసులు, ప్యూన్, క్లర్క్, సాక్షులు అంతా మళ్ళీ వచ్చారు.

ఒక్కొక్కరికి శిక్షలు విధిస్తున్న న్యాయమూర్తి ఆ ముసలాయనకి అపర పరమాత్మలా కనిపిస్తున్నాడు.

"మీకేం కావాలి?" ఉదయం నుంచీ కదలకుండా అక్కడే కూర్చున్న వున్న ఆ ముసలాయన్ని గమనిస్తున్న న్యాయమూర్తి అకస్మాత్తుగా అడిగాడు.

ఆయన కొద్దిగా తడబడ్డాడు. వెంటనే లేచి నిలబడ్డాడు. కుడిచేతిలోని సంచిని ఎడం చేతిలోకి మార్చుకున్నాడు. న్యాయమూర్తి దగ్గరకు నడిచాడు.

అందరికళ్ళూ ఆయన్నే గమనిస్తున్నాయి. చేతిసంచిలోంచి కాగితాలని తీసి న్యాయమూర్తికి అందించి చెప్పాడాయన.

"పందొమ్మిద్ది వందల యాభై నాలుగులో నేను విజయవాడలో పి.డబ్ల్యు.డి.లో పనిచేస్తుండగా ఎనిమిది వందలు లంచం తీసుకున్నాను. ఆ తర్వాత కూడా ఎన్నో సార్లు లంచం తీసుకున్నాను. లంచాలు తీసుకున్న నేరానికి నన్ను శిక్షించాల్సిందిగా కోరుతున్నాను. ఈ సంగతి ఋజువు చేసే కాగితాలు ఇవి."

న్యాయమూర్తి ఆయన అందించిన అన్ని కాగితాలు పరిశీలించి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇన్నేళ్ళ తర్వాత మీలో ఈ ధర్మబుద్ధి ఎలా కలిగింది?"

"నిజమే. నెల్రకితం రిటైరయ్యా.." పొడిగా చెప్పడాయన.

"జైల్లో వుంటే భోజనం దొరుకుంతుందనా?" అడిగాడు న్యాయమూర్తి.

ఆయన తల అడ్డంగా ఆడించి చెప్పాడు.

"నా భార్య, తొమ్మిది మంది పిల్లలతో, పద్నాలుగు మంది మనవళ్ళతో ఉదయం అంతా ఆ ఇంట్లో గడిపేకంటే జైల్లో మంచి చోటుకాబట్టి.."!!

***

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"నువ్వు ఈ వారంలోనే పది దొంగతనాలు చేసినట్టు రుజువయింది" అన్నాడు జడ్జీ గొంగవైపు కోపంగా చూస్తూ.

"నిజమే. 'దేశంలో ప్రతి ఒక్కడూ కష్టపడి పనిచేయడం నేర్చుకోవాలి. దేశంలో వున్న పేదరికాన్ని తొలిగించాలి. అప్పుడే దేశం బాగుపడుతుందీ అన్నారుగదండీ ప్రధానమంత్రిగారు" అన్నాడా దొంగ అమాయకంగా.

"మా అన్నయ్య పరుగు పందెంలో ఎప్పుడూ ఫస్టే"

"అవును ఆ విషయం నాకు ఇందాక మీ అన్నయ్యతో తగాదా పెట్టుకున్నప్పుడు తెలిసిందిలే"

ఆ రోజు ఆఫీసుకు గంట లేటుగా వచ్చాడు గుమాస్తా కొండల్రావ్.

"చూడు మిస్టర్ నువ్విక్కడికి రావాల్సింది పదింటికి. మరి యిప్పుడు టైమెంతో తెలుసా?" సీరియస్‌గా అడిగాడు ఆఫీసర్.

"ఏం సార్! పదింటికేం తమాషా జరిగింది?" అన్నాడు కొండల్రావు అమాయకంగా.

"ఏమే గీతా! ఈత కొడితే సన్నబడతారని విన్నాను. నిజమేనా?" ఆశగా అడిగింది లావాటి సంగీత.

"ఎప్పుడూ సముద్రంలో వుండి ఈతకొట్టే తిమింగలాల్ని చూస్తుంటే నాకలా అనిపించడంలేదే" అంది అనుమానంగా గీత.

క్లర్కు పోస్టులకు ఇంటర్వ్యూ జరుగుతోంది. ఆఫీసర్లు సోమేశాన్ని ఇంటర్వ్యూ చేస్తున్నారు.

"చూడు మిస్టర్ సోమేశం. ఇతరులు చెయ్యలేని పనేదయినా నువ్వు చెయ్యగలవా?" అని అడిగారు ఆఫీసర్లు.

"ఓ యస్.. నేను రాసింది నేను చదవగలను" అన్నాడు ధీమాగా సోమేశం.

ఇద్దరు యువతీయువకులు పార్కులో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.
"మురళీ నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవూ? నీ కష్టాల్లో నేనూ పాలు పంచుకుంటాను"
"చూడు వసంతా! నా కసలు కష్టాలనేవే తెలీదు. హాయిగా బతుకుతున్నాను"
"నిజమే కావచ్చు. కానీ నేను చెప్పేది మన పెళ్ళయిన తర్వాత సంగతి కదా"

"ఏమండీ మీ కొచ్చే జీతం ఎందుకని మనిద్దరికీ చాలడం లేదు?" అంది విమల మొగుడి దగ్గర్నుంచి ఆ నెల జీతం తీసుకుంటూ.
"నేను వారంలో ఆరురోజులు పనిచేస్తున్నాను. నువ్వేమో ఏడురోజులు ఖర్చుపెడుతున్నావ్. అందుకనిలే" అన్నాడు మొగుడు.

"కుమార్ నన్ను ముద్దుపెట్టుకునేప్పుడెందుకు నువ్వు నా చేతులు గట్టిగా పట్టుకుంటావ్" అంది కుమారి.
"మొన్నొకసారి శారదను ఇలాగే చేసినప్పుడు నా మనీ పర్సొకటి పోయిందిలే. ఎందుకైనా మంచిదనీ" అన్నాడు కుమార్.

"చూడండిసార్ రెండు పెళ్ళిళ్ళు చేసుకున్న వ్యక్తికి ఎలాంటి శిక్ష వేస్తారు?" అనడిగాడొకాయన లాయరు జగన్నాధాన్ని.
"వేరె శిక్ష ఎందుకు? ఆ ఇద్దరు భార్యలే వాడికి పెద్ద శిక్ష" అన్నాడు జగమెరిగిన జగన్నాధం.

COMMENTS